రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే

- కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త నర్సింహారెడ్డి

నేరేడుచర్ల, ఏప్రిల్ 14: దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పుడు ఎవరి నోట విన్నా మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అంటున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఎకరం కూడా ఎండకుండా నీటిని సరఫరా చేశామని, రైతులకు కావాల్సిన ఎరువులు, పెట్టుబడి సాయం, 24 గంటలు విద్యుత్ అందించామని గుర్తు చేశారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోతే మిల్లర్లతో మాట్లాడి గిట్టుబాటు ధర ఇప్పించామని తెలిపారు. వర్షంలో తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేశామని వివరించారు. రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ సమస్యను అధిగమిస్తామని నాడు కేసీఆర్ చెప్పిన విధంగానే సీఎం అయిన 6 నెలల్లోని విద్యుత్ సమస్యను అధిగమించారని అన్నారు. అప్పుడు ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందించామని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగునీటికి, తాగునీటికి, కరెంట్ తిప్పలు తప్పడం లేదని విమర్శించారు. జిల్లాకు చెందిన నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పంటలు ఎండిపోతుంటే రైతులను పట్టించుకోలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు గుర్తు కనబడితే ప్రజలు ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభతో రాష్ట్రంలో పరిస్థితులు మారిపోతాయని చెప్పారు. ప్రతి గ్రామం నుంచి వందలాది మంది వరంగల్ సభకు తరలిరావాలని, అదే రోజు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సబ్బండ వర్గాలకు మేలు చేసిందే కేసీఆర్ : బడుగుల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

సీఎంగా పది సంవత్సరాలలో సబ్బండ వర్గాలకు కేసీఆర్ ఎంతో మేలు చేశారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని నాయకత్వం ఉందని, పార్టీలో కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన నష్టమేమీలేదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎకరం కూడా ఎండలే : ఒంటెద్దు నర్సింహారెడ్డి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జగదీశ్‌రెడ్డి సహకారంతో జిల్లాలో ఒక్క ఎకరం పంట కూడా ఎండనివ్వకుండా నీటిని సరఫరా చేశారని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. కేసీఆర్ హయాంలో జనరంజక పాలన అందించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, అన్నపురెడ్డి నారాయణరెడ్డి, పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు అరిబండి సురేశ్‌బాబు, కిష్టపాటి అంజిరెడ్డి, కృష్ణనాయక్, ఇరుగు పిచ్చయ్య, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు చెన్నబోయిన సైదులు, పాలేటి రామారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చందమళ్ల జయబాబు, మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, పచ్చిపాల ఉపేందర్, కేఎల్ఎన్.రెడ్డి, నగేష్‌రాథోడ్, దొడ్డ నర్సింహారావు, ములకలపల్లి రాంబాబు, అమర్‌గౌడ్, చిత్తలూరి సైదులు, అబ్దుల్ నబీ, షేక్ అలీ, రత్నశ్రీ, అస్మా, రాపోలు నవీన్, నాయకులు పాల్గొన్నారు.

'సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి'

నాగారం, ఏప్రిల్ 14: వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతానికి మంగళవారం తిరుమలగిరిలో నిర్వహించనున్న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు. నాగారం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మద్దిరాల: తిరుమలగిరిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎస్ఏ.రజాక్ సోమవారం ఒక ప్రకటనలో బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పొలం చదును చేస్తుండగా బయటపడిన శివలింగం

శివలింగం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

చివ్వెంల, ఏప్రిల్ 14: పొలం చదును చేస్తుండగా పురాతన శివలింగం బయటపడిన ఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తిమ్మాపురంలో రణబోతు భాదిరెడ్డి తన భూమిలో జేసీబీతో చదును చేయిస్తుండగా పురాతన శివలింగంతో పాటు నాగపడిగ విగ్రహాలు బయటపడ్డాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకొని విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూజలు నిర్వహించారు.

'మతోన్మాద శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

కోదాడ టౌన్, ఏప్రిల్ 14: మతోన్మాద శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో సోమవారం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి, ఓయూ విద్యార్థి సంఘం నేత జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విడదీసేందుకు కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్రంపై యువత ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజా చైతన్య వేదిక బాధ్యులు పందిరి నాగిరెడ్డి, స్వామి, బడుగుల సైదులు, మస్తాన్, రామనర్సయ్య, భిక్షం, హరికిషన్‌రావు, రాఘవరెడ్డి, అప్పిరెడ్డి, రాధాకృష్ణ, రవికిరణ్, నరసింహారావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకన్న కుమార్తెకు పాస్ పుస్తకం అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ మణిమాల

నాగారం, ఏప్రిల్ 14: మండల కేంద్రానికి చెందిన దున్నపోతుల వెంకన్న అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వెంకన్న కుటుంబ సభ్యులను నాగారం మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల సోమవారం పరామర్శించారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న వెంకన్న కుమార్తె రేష్మ పేరు మీద పోస్టల్ సేవింగ్ అకౌంట్ ఓపెన్ చేసి రూ.10 వేలు డిపాజిట్ చేసి పాస్ పుస్తకం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, నాయకులు చిప్పలపల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో ఫ్లైఓవర్ పనులు షురూ..

చిట్యాల, ఏప్రిల్ 14 : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలో నిర్మించనున్న ఫ్లైఓవర్ పనులను తిరిగి సోమవారం ప్రారంభించారు. క్రాసింగ్‌లను బ్లాక్ చేసి జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను సర్వీసు రోడ్డు మీదుగా మళ్లించారు. సర్వీసు రోడ్డు వెంట వాహనాలను మళ్లిస్తే ఎలా ఉంటుందో కాంట్రాక్టర్, జాతీయ రహదారి సిబ్బంది పరీక్షిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద, బస్టాండ్ సమీపంలో గల క్రాసింగ్‌లను మూసేశారు. గతంలోనూ ఇలా ఒకసారి చేశారు. కాగా, ఏడు నెలల క్రితమే ఫ్లై ఓవర్ నిర్మిస్తామని చెప్పి పట్టణంలో జాతీయ రహదారి పరిధిలో ఉన్న నిర్మాణాలను కూల్చివేసినప్పటికీ పనులు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తిరిగి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో తర్వగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి శ్రీరామ రక్ష

- అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 14: అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి లత, డీటీడీఓ శంకర్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఆర్‌డీఓ అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, టీఎన్‌జీఓ సెక్రటరీ దున్న శ్యామ్, వివిధ సంఘాల నాయకులు చిన్న శ్రీరాములు, తప్పెట్ల శ్రీరాములు, అంజద్ అలీ, వసంత సత్యనారాయణపిళ్లె తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ తదితరులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

కోదాడ టౌన్: ప్రపంచ మేధావిగా గుర్తించబడిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భారతీయుడు కావడం గర్వించదగిన విషయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడలోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై గల అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.

సూర్యాపేట/కోదాడ/నేరేడుచర్ల/తిరుమలగిరి: అంబేద్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, పలు పార్టీలు, సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు.

సూర్యాపేట టౌన్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

కోదాడ టౌన్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

తిరుమలగిరిలో అంబేద్కర్ జయంతి వేడుకలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, నాయకులు

మునగాలలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ రూరల్: లింగగిరి గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలో బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరేడుచర్లలోఅంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాలకవీడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి

పెన్‌పహాడ్: అనాజిపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

అకాల వర్షం.. అపార నష్టం

- ఈదురు గాలులు, వర్షంతో దెబ్బ తిన్న పంటలు
- నేలకొరిగిన వరి పొలాలు, రాలిన మామిడి
- పలుచోట్ల తడిసిన ధాన్యం

కోదాడ రూరల్: కాపుగల్లు గ్రామంలోని ఓ తోటలో నేలరాలిన మామిడి

కోదాడ రూరల్, ఏప్రిల్ 14: ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన భారీ ఈదుర గాలులు, వానకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కొన్ని గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కాపుగల్లు గ్రామంలో మామిడి చెట్లు నేలకూలాయి.

తిరుమలగిరి: తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోకురిసిన వర్షానికి 20 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన వరి పంట వడగండ్లకు పొలాల్లోనే రాలిపోవడంతో రైతులకు కన్నీరే మిగిలింది. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరి: అకాల వర్షం అన్నదాతను నట్టేట ముంచింది. మండలంలో కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. దీంతో వందల ఎకరాల్లో వరి, మామిడి పంట నేలమట్టమైంది. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యపు రాశులపై కప్పిన పట్టాలు గాలి దుమారానికి అచూకీ లేకుండా పోయాయి.

అనంతగిరి: పాలవరంలో నేలవాలిన వరి చేను

ఆత్మకూర్.ఎస్: మండల పరిధిలోని బోరింగ్ తండా, పాతర్లపహాడ్, ఇస్తాలపురం, ఆత్మకూర్.ఎస్ తదితర గ్రామాల్లో వరి చేలు నేలకొరగడంతో పాటు మామిడి కాయలు రాలాయి.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 14: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలకు, పరిశ్రమల్లో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 'అగ్ని ప్రమాదాల నివారణ పట్ల అవగాహన పెంచుదాం –సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో వారం రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా అగ్ని మాపక అధికారి కృష్ణారెడ్డి, జానయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ ఎంవీ.రమణమూర్తి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలు, సేఫ్టీపై పరిశ్రమలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

మేళ్లచెర్వు: స్థానిక మైహోం పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పించారు.

పాలకవీడు: భవానీపురంలోని దక్కన్ ఫ్యాక్టరీలో ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, సీజీఎం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు.

'జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమాలు సాగించాలి'

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 14: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం నేత దివంగత జార్జిరెడ్డి స్ఫూర్తితో శాస్త్రీయ విద్య, సమసమాజ స్థాపనకు పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్ పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జార్జిరెడ్డి ఆశయ సాధనకు విద్యార్థులు, యువత కృషి చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు సూరం విజయ్, వంటికొమ్ము నగేశ్, బి.ప్రకాశ్, భవాని, రేణుక, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, జయమ్మ, సంతోషిమాత, నర్సయ్య, సయ్యద్, హుస్సేన్, లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

సూర్యాపేటలో నారాయణ స్కూల్ ప్రారంభం

నారాయణ స్కూల్‌ను ప్రారంభిస్తున్న జీఎం గోపాల్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 14: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌ను నారాయణ విద్యా సంస్థల జీఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం గుత్తికొండ రమేశ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మనోజ్‌కుమార్, అనిల్, పుష్పలత, శ్వేత, రహీ మొద్దీన్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలానగర్ రామాలయంలో చోరీ

నేరేడుచర్ల, ఏప్రిల్ 14: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని కమలానగర్ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడి విలువైన వస్తువులు అపహరించినట్లు ఎస్ఐ రవీందర్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఆలయం ప్రధాన ద్వారం పగుల గొట్టిన దొంగలు లోపలికి ప్రవేశించి 15 గ్రాముల బంగారు ఆభరణాలు, 500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ యడవెల్లి వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలి'

- ఎంపీడీఓ సరోజ

గరిడేపల్లి, ఏప్రిల్ 14: నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.సరోజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆమె పరిశీలించి మాట్లాడారు. పథకంలో అందుబాటులో ఉన్న యూనిట్లపై అవగాహన పెంచుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద దరఖాస్తు పత్రాలను సమర్పించాలని వివరించారు. సోమవారం నాటికి మండలంలో 1,300 దరఖాస్తులు అందాయని, ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

గుత్తాను కలిసిన నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుత్తా సుఖేందర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం సాయంత్రం కలిశారు. ఇటీవల ఉపాధి హామీ నిధుల విషయంలో కలెక్టర్‌కు గుత్తా ఆదేశాల మేరకు అసెంబ్లీ సెక్రటరీ నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారిక ప్రొఫార్మలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇచ్చిన రూ 3 కోట్ల నిధుల ప్రపోజల్స్‌ను ఎలా రద్దు చేస్తారని, దానిపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సీఎం మీటింగ్ కోసం వెళ్లిన కలెక్టర్ ఇలా త్రిపాఠి గుత్తాను కలిసి వివరణ ఇచ్చినట్లు తెలిసింది. విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లు సహజమంటూనే నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ఈ సందర్భంగా కలెక్టర్‌కు గుత్తా సూచించినట్లు తెలిసింది.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

అర్వపల్లిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి, ఏప్రిల్ 14: మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే విగ్రహాల ఏర్పాటుకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపి, వెంకట్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, వీరస్వామి, మహరాజు, సైదులు, శంకర్, శ్రీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీజేల వినియోగంపై కేసులు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 14: జిల్లాలో డీజేల వినియోగంపై నిషేధం ఉన్నందున పోలీస్ నిబంధనలను ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కె.నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలుకూరు మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో గత శుక్రవారం జరిగిన ఓ పుట్టిన రోజు వేడుకలో డీజే వినియోగించినందుకు చిలుకూరు పీఎస్‌లో కార్యక్రమ నిర్వాహకులు, డీజే యజమానులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసి డీజే సీజ్ చేసినట్లు వివరించారు. అదేవిధంగా సూర్యాపేటలోని కస్తూరి బజార్‌లో శనివారం ఓ పెళ్లి వేడుకలో డీజే ఉపయోగించగా 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణ పరిధిలోని బలరాంతండాలో పుట్టినరోజు వేడుకలో డీజే ఉపయోగించినందుకు ఇద్దరు డీజే నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పోలీసుల అనుమతులు లేకుండా డీజేలు వినియోగిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

'రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలి'

కల్లూరు గ్రామంలో రక్తదానం చేస్తున్న యూత్ సభ్యులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 14: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మండలంలోని కల్లూరు గ్రామ అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యుడు నందిపాటి గురవయ్య అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం కల్లూరు గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 ఏండ్ల లోపు ఆరోగ్యవంతులైన వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.